నేడు గురుకుల పాఠశాలలకు భూమి పూజ



నిర్మాణ ప్రదేశ పరిశీలనలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, అధికారులు

కొడంగల్, న్యూస్‌టుడే: మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ గ్రామంలో నేడు ఎస్సీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల నిర్మాణానికి భూమి పూజ చేసేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఆర్ అండ్ బీ ఆధ్వర్యంలో ఈ పనులు సాగుతాయి. గురువారం గురుకుల పాఠశాల నిర్మించే ప్రదేశాన్ని కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్ అండ్ బీ ఎస్ఈ వసంత్‌కుమార్‌లు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ దాదాపు రూ.250 కోట్లతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, డీఈ సురేందర్, తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ మాట్లాడుతూ.. శుక్రవారం ఉదయం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి తిరుపతిరెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ల చేతుల మీదుగా భూమి పూజలు జరుగుతాయని తెలిపారు.



పెద్దేముల్ మండలంలోని పెద్దేముల్ తండాలో భవాని మాత ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారు గురువారం దుర్గామాతగా భక్తులకు దర్శనమిచ్చారు. - న్యూస్‌టుడే, పెద్దేముల్

సింహ వాహనంపై అనంతుడు



జిల్లా కేంద్రం వికారాబాద్ ఆలంపల్లిలోని శ్రీ అనంతపద్మనాభ స్వామి వారు గురువారం సింహ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు.

– న్యూస్‌టుడే, వికారాబాద్ టౌన్.

బోరు బండి స్వాధీనం

పరిగి గ్రామీణ: సుమారు రూ.కోటి విలువైన బోరు బండి అక్రమ రవాణా అవుతుండగా పోలీసులు పట్టుకున్నారని ఎస్ఐ సంతోష్‌కుమార్ గురువారం తెలిపారు. పరిగి పట్టణం మీదుగా బీజాపూర్ జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాలను పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా కొత్త బోరు బండి ఎలాంటి నంబరు లేకుండా వెళ్తుండడంతో వివరాలు అడిగారు. సంబంధించిన పత్రాలు చూపకపోవడంతో వాహనాన్ని అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు.

కిట్లకు ఎదురుచూపులేనా?

గర్భిణులు, బాలింతలకు నెలలుగా అందని వైనం

న్యూస్‌టుడే, వికారాబాద్ మున్సిపాలిటీ, పరిగి:

జిల్లాలోని వేల మంది గర్భిణులు, బాలింతలకు పోషకాహార, మాతా శిశు సంరక్షణ కిట్లు సకాలంలో అందడంలేదు. అంతేకాదు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన అనంతరం బాలింతలకు ఇచ్చే నగదు ప్రోత్సాహకాలు సైతం ఏడాదిన్నర నుంచి పంపిణీ చేయటం లేదు. దీంతో బాలింతలు వారి కుటుంబ సభ్యులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.



వికారాబాద్ ఆసుపత్రిలో బాలింతల వార్డు

కాన్పులు పెంచాలని 2017లో శ్రీకారం

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచటం కోసం నగదు ప్రోత్సాహకం (ఆడబిడ్డకు రూ.13వేలు, మగ బిడ్డకు రూ.12 వేలు), కిట్టు పంపిణీ పథకాన్ని 2017లో ప్రారంభించారు. దీనికింద గర్భవతులు, పుట్టబోయే బిడ్డ బలంగా ఉండటానికి అవసరమైన పోషకాలతో కూడిన కిట్టును ప్రభుత్వం అందజేస్తుంది. అంతే కాకుండా గర్భిణులకు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలను అందించటం, వారిని పరీక్షించి అవసరమైన మందులు పంపిణీ చేస్తారు. పథకం నాలుగేళ్లపాటు సజావుగా సాగింది. ఆ తర్వాత గాడి తప్పింది.

జనవరి నుంచి సెప్టెంబర్ 2024 వరకు ప్రసవాలు:

- మొత్తం : 9435
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో: 6788
- ప్రైవేట్‌లో : 2647
- కిట్లు అందుకోవాల్సిన లబ్ధిదారులు.. 8000 మంది

తాండూరు ఆసుపత్రిలో అత్యధికం

జిల్లా ఆసుపత్రి తాండూరులో అత్యధిక ప్రసవాలు జరుగుతున్నాయి. తాండూరులో ప్రతి నెల 300 నుంచి 400 వరకు, వికారాబాద్‌లో 150 నుంచి 180 కాన్పులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 5 నుంచి 8 కాన్పులు జరుగుతున్నాయి.

ఇవిగో ఉదాహరణలు

* వికారాబాద్ పురపాలక పరిధిలోని స్వాప్నిక ఆరు నెలల క్రితం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పండంటి శిశువును జన్మించింది. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవిస్తే అందజేసే ఎంసీహెచ్ (మాతా శిశు సంరక్షణ) కిట్‌ను ఇప్పటి వరకు ఇవ్వలేదు. అంతే కాకుండా ప్రభుత్వ సహాయాన్ని కూడా అందించలేదు. అధికారులను అడిగితే రేపుమాపంటూ దాటవేస్తున్నారు.

* తాండూరు పట్టణానికి చెందిన రాధ నాలుగు నెలల గర్భిణి. ఆమెకు ప్రభుత్వం తరపున అందాల్సిన పోషకాహార కిట్టు ఇప్పటికీ పంపిణీ చేయలేదు. ఈ కిట్టు ఇప్పటి వరకు పంపిణీ చేయకపోవటంతో లబ్దిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి రాగానే పంపిణి చేస్తామని వైద్యారోగ్య సిబ్బంది తెలిపి పంపిస్తున్నారు.



ప్రభుత్వం దృష్టికి తెచ్చాం : డాక్టర్ పవిత్ర, ప్రోగ్రాం అధికారిణి, వికారాబాద్

ప్రభుత్వం నుంచి సకాలంలో సరఫరా కాకపోవటంతో జిల్లాలో పోషకాహార కిట్లు, మాతా శిశు సంరక్షణ కిట్లు లబ్ధిదారులకు పంపిణీ చేయటం లేదు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తెచ్చాం. ప్రభుత్వం నుంచి మంజూరైన వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేస్తాం. నగదు రాగానే వారి ఖాతాలో జమ చేస్తారు.

ఆకసం.. సప్తవర్ణ రంజితం



పెద్దేముల్ మండలంలోని పలు గ్రామాల్లో వర్షం పడటంతో మంబాపూర్, జనగాం తదితర గ్రామాల్లో ఇంద్రధనుస్సు ఇలా కనువిందు చేసింది. దీన్ని చూసిన పిల్లలు సందడి చేశారు.

– న్యూస్‌టుడే, పెద్దేముల్.

కార్యాలయాల్లో బతుకమ్మ సంబురాలు



వేడుకల్లో పాల్గొన్న ఎస్పీ నారాయణరెడ్డి తదితరులు

వికారాబాద్, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో పోలీసు కుటుంబాలకు చెందిన మహిళల ఆనందోత్సాహాలు, ఆటపాటల మధ్య బతుకమ్మ పండుగ సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారి నారాయణరెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేష్, ఆర్ఐలు డేవిడ్‌రాజు, అంజాద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలో సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యాలయం మహిళా ఉద్యోగులు, సిబ్బంది బతుకమ్మల్ని రకరకాల పూలతో అందంగా తయారు చేసి మధ్యలో పేర్చి ఆడిపాడారు. బతుకమ్మ ఆటా, పాటలతో కార్యాలయ ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది.

చందాల వాగు.. దాటితేనే సాగు

మోమిన్‌పేట, మండలం నందివాగు ప్రాజెక్టులో కలిసే పెదవాగు ఇది. దీన్ని దాటి అవతలి వైపునున్న పొలం పనులకు రైతులు వెళ్లాలంటే అవస్థలు తప్పడం లేదు. వర్షాకాలం వచ్చిందంటే వాగునిండుగా ప్రవహించి రాకపోకలు నిలిచిపోతున్నాయి. వాగు అవతల సుమారు 450 ఎకరాల సాగు భూమి ఉంది. నిత్యం 100 మంది రైతులు వాగుదాటి వ్యవసాయం చేస్తుంటారు. అధికారులకు, నేతలకు సంవత్సరాలుగా విన్నవించినా వంతెన ఏర్పాటు కాలేదు. చేసేదిలేక రైతులంతా చందాలు వేసుకుని తాత్కాలిక వంతెన నిర్మించుకున్నారు. 2017, ఫిబ్రవరి 7న రూ.కోటి 16 లక్షల వ్యయంతో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నేటికీ అడుగు ముందుకు పడక శిలాఫలకం వెక్కిరిస్తోంది. రైతులకు మాత్రం తాము నిర్మించుకున్న తాత్కాలిక వంతెన మాత్రమే ఆధారమైంది.



2017 నాటి శిలాఫలకం



– ఈనాడు వికారాబాద్, న్యూస్‌టుడే, మోమిన్‌పేట్.

నేత్ర పర్వం.. వేంకటేశ్వరుడి శోభాయాత్ర



వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: వికారాబాద్ హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. గురువారం సాయంత్రం శ్రీవారి రథోత్సవ శోభాయాత్ర పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పగడాల లక్ష్మీనారాయణ, భక్తులు, చిన్నారులు పాల్గొని రథాన్ని లాగారు. మహిళా భక్తులు, చిన్నారులు కోలాటాలు, జడ కోలాటం, చెక్క భజన చేశారు.

పాఠశాలలో గుట్టుగా బల్లల విక్రయం

తాండూరుగ్రామీణ: కరణ్‌కోట జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సమకూర్చిన ఆధునిక బల్లలను స్థానిక రాజకీయ నాయకుడు గుట్టుగా విక్రయించాడు. ఆధునికీకరణలో భాగంగా కొత్త బల్లలను కొన్నాళ్ల క్రితం తెచ్చి బయటే ఉంచారు. సెలవులు చూసుకుని నేత విక్రయించాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు, ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

బియ్యాన్ని నిర్ణీత సమయంలో చేరవేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్ కలెక్టరేట్: లక్ష్యాలకు అనుగుణంగా సీఎంఆర్ (మరఆడించిన బియ్యం)ను నిర్ణీత సమయంలో అప్పగించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. గురువారం ఆయన ఛాంబర్‌లో సీఎంఆర్ ఖరీఫ్, రబీ 2023-24లకు సంబంధించిన డెలివరీపై రైస్ మిల్లర్లు, తహసీల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లు పట్టిన బియ్యాన్ని ఎఫ్‌సీఐకి, సీఎస్‌సీకి ఈనెల 31 లోగా అప్పగించాలని ఆదేశించారు. సమావేశంలో పౌర సరఫరాల అధికారి మోహన్‌బాబు, మేనేజర్ విజయలక్ష్మి, రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బాలేశ్వర్‌గుప్త, కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

13న కొడంగల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి రాక

కొడంగల్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 13న కొడంగల్ పట్టణంలోని తన నివాసానికి విచ్చేస్తున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ గురువారం తెలిపారు. ప్రతి సంవత్సరం దసరా తరువాత కార్యకర్తలను కలవడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగానే దసరా మరుసటి రోజు కొడంగల్‌కు వస్తున్నారని తెలిపారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: వైద్యతాండూరు జిల్లా ఆస్పత్రిని శిక్షణ కలెక్టరు ఉమాహారతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అత్యవసర సేవలు, బయటి సేవల విభాగం తదితరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వైద్యులతో మాట్లాడారు. రోగుల విషయంలో ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం వహించరాదన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి పర్యవేక్షకుడు డాక్టరు రవి శంకర్, వైద్యులు ఆనంద్‌గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న శిక్షణ కలెక్టరు ఉమాహారతి

తాండూరు విద్యార్థినికి రాష్ట్ర మంత్రి ప్రశంసలు



రుక్మిణితో మంత్రి కోమటిరెడ్డి

తాండూరుగ్రామీణ, న్యూస్‌టుడే: తాండూరు మండలం ఖాంజాపూర్ గేటు వద్ద కొనసాగుతున్న తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థిని రుక్మిణిని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం అభినందించారు. మలేషియాలో నిర్వహించిన అంతర్జాతీయ ఖోఖో పోటీల్లో బంగారు పతకం సాధించింది. ఈనెల 14న తమిళనాడు కోయంబత్తురులో జరిగే పోటీలకు వెళ్లే అవకాశాన్ని దక్కించుకుంది. దీంతో మంత్రి విద్యార్థినిని ప్రత్యేకంగా ప్రశంసిస్తూ నగదు పురస్కారాన్ని అందించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ప్రవీణరెడ్డి, సామాజిక కార్యకర్త వెంకట్ బృందం శుభాకాంక్షలు తెలిపింది.

ప్రభుత్వ కార్యాలయాల తనిఖీ

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ గురువారం బొంరాస్‌పేట తహసీల్దార్ కార్యాలయాన్ని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. కల్యాణలక్ష్మి దస్త్రాలపై గెజిటెడ్ అధికారులు సంతకం చేయక లబ్దిదారులు ఇబ్బందులు పడుతున్నారని మెట్లకుంట మాజీ ఎంపీటీసీ నర్సింహులు నాయుడు సబ్ కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు.

యువతా మేలుకో.. ఓటు నమోదు చేసుకో

న్యూస్‌టుడే, వికారాబాద్: ఓటు హక్కు నమోదు, ఓటరు జాబితా సవరణకు రాష్ట్ర ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. 2025 జనవరి1 నాటికి 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు కావాలని సూచించింది. పూర్తి స్థాయిలో తనిఖీ చేసి ఓటరుగా నమోదు చేయనున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే జిల్లా అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కల్పించి, ఇంటింటి సర్వే నిర్వహిస్తూ కొత్త ఓటర్ల నమోదు, సవరణలు, మార్పులు, తొలగింపులు, చేర్పులు తదితరాంశాలపై అవకాశం కల్పిస్తున్నారు.

జనవరిలో తుది జాబితా...

2025 జనవరి 6న ఓటరు తుది జాబితా విడుదల చేయనున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ నెల 18 వరకు ఇంటింటి సర్వే, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, కొత్త కేంద్రాల ఏర్పాటు, జాబితాలో తప్పులు దొర్లకుండా నాణ్యమైన చిత్రాలు ఉండేలా చూడటం, పోలింగ్ కేంద్రాల హద్దులు నిర్ణయించడం వంటి బాధ్యతలు నిర్వహిస్తారు. తప్పుల సవరణ, చిరునామా మార్పు, తొలగింపు వాటికి దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో ఈ నెలాఖరు వరకు పరిశీలించనున్నారు. నవంబరు 28 నుంచి డిసెంబరు 12 వరకు దరఖాస్తుదారుల వివరాలు పరిశీలిస్తారు. జనవరి 1న రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆమోదానికి జాబితాను పంపిస్తారు. 6న తుది జాబితా విడుదల చేస్తారు.



బారులు తీరిన ఓటర్లు(పాతచిత్రం)

ఓటు ప్రాధాన్యాన్ని తెలుసుకోవాలి:



ప్రజాస్వామ్యంలో ఓటుకు ఉన్న ప్రాధాన్యాన్ని యువత తెలుసుకోవాలి. హక్కు పొందేందుకు, ఓటు వేసేందుకు కొంత మంది ఆసక్తి చూపకపోవడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో అర్హులైన యువత ఓటు నమోదుకు ముందుకు రావాలి.– లింగ్యానాయక్, అదనపు కలెక్టర్.

పత్తి కొనుగోళ్లకు కసరత్తు

న్యూస్‌టుడే, వికారాబాద్, తాండూరు:

జిల్లాలో తెల్ల బంగారం (పత్తి) కొనుగోళ్లకు విపణిశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ఒక్కో కొనుగోలు కేంద్రానికి ఎన్ని గ్రామాలను కేటాయించాలనే పనిలో నిమగ్నమయ్యారు.

దిగుబడులపై వర్షాల ప్రభావం

జిల్లాలోని పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పత్తి పంటకు నష్టం వాటిల్లింది. దీంతో ఎకరానికి సగటున 8 క్వింటాళ్ల వరకు మాత్రమే దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. పత్తి కొనుగోలు కేంద్రాలపై దృష్టి సారించాలని ఇప్పటికే కలెక్టర్ అధికారులను ఆదేశించడంతో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అంతర్జాతీయ విపణిలో పత్తికి డిమాండ్ ఉండటంతో మునుపెన్నడూ లేని విధంగా ఈసారి బహిరంగ విపణిలో పత్తి ధరలు పెరిగే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

సీసీఐ కేంద్రాలు నామమాత్రమేనా..

జిల్లాలో 14 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.



పత్తి మొక్కలకు క్రిమిసంహారక మందుల పిచికారీ

జిల్లాలో పత్తి సాగు వివరాలు

- గతేడాది .. 2.15 లక్షల ఎకరాలు
- ఈ ఏడాది.. 2.5 లక్షల ఎకరాలు
- కొనుగోలు కేంద్రాలు.. 14
- గతేడాది క్వింటాలుకు మద్దతు ధర.. రూ.6,380
- ఈ ఏడాది.. రూ.7,000
- ప్రస్తుతం బహిరంగ విపణిలో.. రూ.8,000 నుంచి రూ.8,500

మార్కెట్లో మద్దతుకు మించిన ధర

ప్రభుత్వ మద్దతు ధర రూ.7 వేల కంటే బయట మార్కెట్‌లో అధికంగా ఉండటంతో రైతులు బహిరంగ విపణిపై ఎక్కువ దృష్టి సారించే వీలుంది. దీంతో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే పత్తి కొనుగోలు కేంద్రాలు నామమాత్రంగానే మారనున్నాయి. అయినా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వికారాబాద్‌లో 3, తాండూర్‌లో 2, పరిగిలో 3, కొడంగల్‌లో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు.

అటకెక్కిన నామ్..: దేశవ్యాప్తంగా పంట కొనుగోళ్లకు అవకాశం కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నామ్ విధానం అమలు క్షేత్ర స్థాయిలో సక్రమంగా కనిపించడంలేదు. ఐదేళ్లుగా అంతంతమాత్రంగానే కొనుగోళ్లు జరపడం, తరచూ సాంకేతిక ఇబ్బందులు తలెత్తడంతో అధికారులు నామ్ విధానానికి స్వస్తి పలుకుతున్నారు. కేంద్రం అమలు చేస్తున్న జాతీయ వ్యవసాయ మార్కెట్ (నామ్) విధానంతో పత్తి పంటను విక్రయించిన రైతులకు నేరుగా కాకుండా ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేయాల్సి ఉంటుంది.

మెలకువలు పాటిస్తే మంచి ధర లభ్యం

రైతులు ఇష్టారీతిలో పంటను అమ్ముకోకుండా చిన్నపాటి మెలకువలు పాటిస్తే మంచి ధర వస్తుంది. సీసీఐ నిబంధనల ప్రకారం 8 నుంచి 12 శాతం తేమ ఉన్న పత్తిని కొనుగోలు చేస్తారు. అంతకంటే ఎక్కువ శాతం తేమ ఉంటే ధరలో కోత విధిస్తారన్నది రైతులు గుర్తుంచుకోవాలి. సమయాన్ని బట్టి పత్తిని తెంపాలి. లేకపోతే అనుకున్న ఫలితం అందుకునే వీలుండదు. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి.

– మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి.

సంతోషంతో మానసిక సమస్యలు దూరం

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: కుటుంబ సభ్యులతో, మిత్రులతో సంతోషంగా గడపటం వల్ల మానసిక రోగాలు దరిచేరవని ఎన్‌సీడీ ప్రోగాం అధికారిణి డాక్టర్ నీరోష, మానసిక వైద్యులు డాక్టర్ మనోజ్, శ్రీకాంత్ అన్నారు. గురువారం స్థానిక రామయ్యగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యశాఖ కమిషనర్, జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానసిక సమస్యలున్న వారు 14416 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తగిన సహాయాన్ని పొందవచ్చని సూచించారు. వైద్యాధికారి నిఖిల్, జిల్లా ఎన్‌సీడీ కోఆర్డినేటర్ రేణుకుమార్, కౌన్సిలర్ కృష్ణకాంత్ పాల్గొన్నారు.

దామగుండంలో హెలికాప్టర్ చక్కర్లు

పూడూరు, న్యూస్‌టుడే: పూడూరు మండలం దామగుండం అటవీ ప్రాంతంలో గురువారం మధ్యాహ్నం రక్షణ శాఖ హెలికాప్టర్ చక్కర్లు కొట్టింది. ఇక్కడ నేవీ ప్రాజెక్టు పనులకు ఈనెల 15న శంకుస్థాపన చేసేందుకు కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పెద్దఎత్తున హాజరు కానున్నారు. దీంతో మంత్రులు దిగేందుకు హెలిప్యాడ్‌ను ఎక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై అధికారులు ట్రయల్ రన్ చేపట్టారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

రాడార్ స్టేషన్ మార్చాలని ప్రధానికి కార్డులు



పూడూరు: రాడార్ స్టేషన్‌నుమరో ప్రాంతంలో ఏర్పాటుచేయాలని గురువారం మండల పరిధిలోని కెరవెల్లి గ్రామంలో జేఏసీ ఛైర్మన్ వెంకటయ్య కోరారు. ఆయన ఆధ్వర్యంలో స్థానికులు సేవ్ దామగుండం.. సేవ్ ప్రకృతి నినాదంతో ప్రధానికి పోస్టు కార్డులు రాసి మాట్లాడారు.

మహేందర్ రెడ్డికి సన్మానం

తాండూరు, తాండూరు టౌన్, న్యూస్‌టుడే: శాసన మండలిలో చీఫ్ విప్‌గా బాధ్యతలు చేపట్టిన పట్నం మహేందర్‌రెడ్డి గురువారం తొలిసారిగా తాండూరుకు వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, సునీత తమ ఇంటికి ఆహ్వానించి సన్మానం చేశారు.

రైల్వే ఆధునికీకరణ త్వరగా పూర్తిచేయాలి

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: వికారాబాద్ రైల్వే జంక్షన్‌లో కొనసాగుతున్న అధునికీకరణ పనుల్లో వేగం పెంచాలని సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ ప్రాంతీయ మేనేజర్ (డీఆర్ఎం) బర్తేష్‌కుమార్ జైన్ అన్నారు. విశ్రాంతి గదులు, పార్కు తదితర పనులను పరిశీలించి మాట్లాడారు.

ధర్మ రక్షణే ఆర్ఎస్ఎస్ ధ్యేయం

ధారూర్: ధర్మ రక్షణ కోసమే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)ను స్థాపించడం జరిగిందని ప్రాంత కార్యకారిణి రాంప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో పథసంచలన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

తీరొక్క బతుకమ్మ..



సిద్దిపేటలో ధనలక్ష్మి బతుకమ్మ



మెదక్ పరిధి జంబికుంటలో



సిద్దిపేటలో శివ లింగం రూపంలో..

ఒక్కేసి పువ్వేసి చందమామ.. ఒక్క జాము లాయె సందమామా.. అంటూ ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తీరొక్క రూపుల్లో అలంకరించిన తీరు అందరినీ ఆకట్టుకోవడం విశేషం. - న్యూస్‌టుడే బృందం



రేగోడ్‌లో అమ్మవారి ప్రతిమతో..



సిద్దిపేటలో పూలతో ఇలా..



సిద్దిపేటలో



రామాయంపేటలో దుర్గాదేవి, అయోధ్య రామ మందిరంగా కొలువుదీరిన బతుకమ్మ

ఇష్టంతో ఆడి.. ఛాంపియన్లుగా నిలిచి..

న్యూస్‌టుడే, మెదక్ టౌన్

ఫుట్‌బాల్.. ప్రపంచాన్ని ఊపేసే ఆట. ఇందులో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఎంతో మంది రాణించారు. మెదక్, జహీరాబాద్ ప్రాంతాల్లో ఈ ఆట ఎక్కువగా ఆడుతుంటారు. ఇలాంటి క్రీడల్లో గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారిణులు రాణిస్తూ జాతీయస్థాయిలో తమ సత్తా చాటుతుండటం విశేషం. తాజాగా మెదక్‌లో 68వ రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ అండర్-17 బాలికల రాష్ట్ర ఛాంపియన్ జరిగాయి. ఇందులో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు జట్టును విజయ బాటలో నడిపించి, ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించడం విశేషం.

ఉమ్మడి జిల్లాలో ఫుట్‌బాల్‌కు క్రేజ్ ఉండటంతో ఫుట్‌బాల్ అసోసియేషన్ మెదక్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఇందుకు మెదక్ - 8, సిద్దిపేట- 7, సంగారెడ్డి- ముగ్గురిని ఎంపిక చేశారు. వీరికి పోటీలకు నాలుగు రోజుల ముందు నుంచే మెదక్‌లోని ఇందిరాగాంధీ మైదానంలో ప్రత్యేక తర్ఫీదు ఇచ్చారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పలువురు తమ ఆటతో రాణించారు. వారిలో ఉమ్మడి మెదక్ నుంచి 5 మందిని జాతీయస్థాయి పోటీలకు ఆడే రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యారు.

తండ్రి ఇష్టం మేర..



జట్టుకు సిద్దిపేట జిల్లా కొండపాక మండలం జప్తినాచారానికి చెందిన చైతన్య శ్రీ కెప్టెన్‌గా వ్యవహరించారు. తల్లిదండ్రులు కవిత, రాములు. ప్రస్తుతం సిద్దిపేటలో నివాసం ఉంటున్నారు. రాములుకు ఫుట్‌బాల్ అంటే మక్కువ. దీంతో తన కుమార్తెను అంతర్జాతీయ క్రీడాకారిణిగా చూడాలన్న లక్ష్యంతో చైతన్యశ్రీ నాలుగో తరగతి చదువుతున్న సమయంలోనే హకీంపేట క్రీడా పాఠశాలలో చేర్పించారు. తండ్రి ఇష్టాన్ని గమనించిన ఆమె ఏడో తరగతి పూర్తయ్యాక ఇంటికొచ్చి సొంతంగా సాధన చేస్తూ వచ్చారు. శిక్షకురాలు భాగ్యమ్మ చరవాణి ద్వారా ఇచ్చే సలహాలు పాటిస్తూ వచ్చారు. తాజాగా ఎస్జీఎఫ్ పోటీల్లో మెదక్ జట్టు ఛాంపియన్‌గా నిలవడంలో కెప్టెన్‌గా కీలకపాత్ర పోషించారు. ఫైనల్‌లో తన ఆట తీరు అందరినీ ఆకట్టుకుంది. ఈమె ప్రత్యర్థి జట్టు గోల్ చేయకుండా అడ్డుకోవడం అందరినీ ఆకట్టుకుంది.

తొలి ప్రయత్నంలోనే..



ఎస్జీఎఫ్ పోటీల్లో జరిగిన ఫైనల్‌లో ఇరు జట్లు సమాన పాయింట్లు పొందాయి. ఫలితానికి అదనంగా 5 నిమిషాల్లో ఆట ఆడారు. ఫలితం తేలకపోవడంతో అందరూ నిరుత్సాహపడ్డారు. మరోసారి 5 ని. సమయం ఇచ్చి ఆడించారు. 2 ని. ముందు గోల్ చేసి మెదక్ జట్టు ఛాంపియన్‌గా నిలవడంలో క్రీడాకారిణి శ్రీవాణి కొట్టిన గోలే కారణం. ఈమె స్వగ్రామం మెదక్ మండలం సంగాయిగూడ తండా. తండ్రి తార్య మెదక్‌లో హోంగార్డు, తల్లి మహిళా రైతు. శ్రీవాణి మెదక్ తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. భాగ్యమ్మ వద్ద శిక్షణ పొందుతున్నారు. తొలిప్రయత్నంలోనే జాతీయస్థాయిలో ఆడే జట్టుకు ఎంపికయ్యారు.



'ఈనాడు' లక్ష్య ఆధ్వర్యంలో..

ఉమ్మడి మెదక్ ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో క్రీడాకారిణులకు శిక్షణ ఇచ్చారు. వారికి ఆయనే సొంతంగా భోజనం ఏర్పాటుచేయించారు. స్థానిక టీజీఆర్ఎస్‌లో వసతి కల్పించారు. వారికి 'ఈనాడు' ఆధ్వర్యంలో 'లక్ష్య' కార్యక్రమంలో భాగంగా నియమించిన శిక్షకురాలు భాగ్యమ్మ ప్రత్యేకంగా తర్ఫీదు ఇచ్చారు. ప్రధానంగా క్రీడాకారిణుల్లో సమష్టిభావాన్ని పెంపొందించారు.

తొలిసారి ఆడిపాడి



సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం పెద్దతండాలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ సర్పంచి గుగులోతు లక్ష్మి సక్రునాయక్ ఆధ్వర్యంలో తొలిసారిగా ఆడిపాడటం విశేషం. గతంలో ఈ గ్రామంలో బతుకమ్మ ఆడే సంప్రదాయం లేకపోవడం గమనార్హం. - న్యూస్‌టుడే, అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం)

అమెరికాలో వైభవం చాటి..



అమెరికాలోని కాలిఫోర్నియాలో నివాసం ఉంటున్న సిద్దిపేట వాసుల బతుకమ్మ సంబరాలు - న్యూస్‌టుడే, సిద్దిపేట

సనాతన ధర్మాన్ని కాపాడాలి: సుమన్



కాళికామాతకు అభిషేకం చేస్తున్న సినీ నటుడు సుమన్

వెల్దుర్తి, న్యూస్‌టుడే: సనాతన ధర్మాన్ని కాపాడాలని, కుల మతాలకు అతీతంగా ప్రజలంతా కలిసిమెలిసి జీవించాలని సినీ నటుడు సుమన్ పేర్కొన్నారు. వెల్దుర్తి మండలం మన్నెవారిజలాల్‌పూర్ శివారులో కాళికామాత ఆలయంలో గురువారం నిర్వహించిన దివ్య విశ్వశాంతి మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడారు. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడే వారిని వారి విజ్ఞతకు వదిలేస్తున్నామని, తిరుపతి లడ్డూ వ్యవహారంపై విచారణ జరుగుతోందని, ఇవన్నీ చూస్తుంటే బాధ కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు అన్ని కులాలు, మతాలకు చెందిన స్నేహితులున్నారని పేర్కొన్నారు. మన్నెవారిజలాల్‌పూర్ కాళికామాత అమ్మను దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. దేశం బాగుండాలని, సినిమా పరిశ్రమ బాగుండాలని, చిన్న నిర్మాతలు ఆర్థికంగా ఎదగాలని అమ్మవారిని కోరుకున్నట్లు సుమన్ తెలిపారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్మన్ సుహాసినిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్, భారాస, భాజపా పార్టీలకు చెందిన నాయకులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. అన్నదానం చేపట్టారు.

ద్విచక్ర వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం



సుధాకర్

శివ్వంపేట: నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని బైక్ ఢీకొట్టడంతో మృతి చెందాడు. శివ్వంపేట ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని గొట్టిముక్లకు చెందిన జరుపటి సుధాకర్(19) బుధవారం రాత్రి కాలినడకన వెళ్తున్నాడు. అదే సమయంలో చెన్నాపూర్‌కు చెందిన ద్విచక్ర వాహనదారుడు చిన్నగొట్టిముక్ల కొత్త కాలనీ వద్ద సుధాకర్‌ను ఢీకొట్టడంతో మృతి చెందాడు. తండ్రి నాగేష్ ఫిర్యాదుతో కేసు నమోదైంది. కుమార్తె వివాహం వచ్చే నెలలో ఉందని, ఈ తరుణంలో కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. కేసు నమోదైంది.

గునుగు పూలకు వెళ్లి..



వెంకటేష్

కుకునూరుపల్లి(కొండపాక గ్రామీణం): బతుకమ్మ పేర్చేందుకు గునుగుపూలు తెచ్చేందుకు వెళ్లిన మాజీ ఉప సర్పంచి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం లకుడారం రాజీవ్ రహదారిపై జరిగింది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. లకుడారానికి చెందిన మాజీ ఉపసర్పంచి బింగి వెంకటేశ్ (39) గురువారం ఉదయం ఇంటి నుంచి బైక్‌పై వెళ్లాడు. తిరిగొస్తుండగా మలుపు వద్ద వెంకటేశ్ వాహనాన్ని హైదరాబాద్ వెళ్తున్న కారు ఢీకొట్టడంతో కింద పడి మృతి చెందాడు. కారును గోదావరిఖనికి చెందిన బొల్లి రాజు నడిపిస్తున్నారు. వెంకటేశ్ సోదరుడు మల్లేశం ఫిర్యాదుతో కేసు నమోదైంది.

పరోపకారుడు.. విధికి తలవంచాడు



అనంత్‌రెడ్డి

హైదరాబాద్, వికారాబాద్: పెద్ద చదువులు చదవకపోయినా ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తూ నలుగురికి సాయం చేసే మనస్తత్వం అతని సొంతం.. ఆపత్కాలంలో ఉన్న పలువురికి 26 సార్లు రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచాడు. ప్రేమించిన యువతిని తల్లిదండ్రులను ఒప్పించి ఏడాదిన్నర కిందట కులాంతర వివాహం చేసుకున్నాడు. పరోపకారిగా పేరు తెచ్చుకున్న ఆ యువకుణ్ని రోడ్డు ప్రమాదం కబళించింది. సాయం చేసే చేతులు ఇక లేవన్న నిజాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇద్దరు ఆడపిల్లల తరువాత అనంతపద్మనాభస్వామికి మొక్కుకుంటే జన్మించగా, ఎంతో అపురూపంగా ఆ దేవుడి పేరే పెట్టారు. అయినా ఇలా అయిందేమిటని, అతన్ని మంచితనాన్ని చూసైనా మృత్యువు కరుణించలేదని ఆ తల్లిదండ్రులతోపాటు గ్రామస్థులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. కేపీహెచ్‌బీ ఎస్సై నజీర్‌మియా తెలిపిన వివరాలు.. వికారాబాద్ మండలం గోదమగూడకు చెందిన ఏనుగు అనంత్‌రెడ్డి(24) ఫొటోగ్రాఫర్. సామాజిక కార్యకర్త. తలసేమియా వ్యాధిగ్రస్తులు, ప్రాణాపాయంలో ఉన్నవారికి రక్తదానం చేశాడు. ఆగస్టు 11న అర్ధరాత్రి బైక్‌పై ఒంటరిగా ఉప్పల్ నుంచి కేపీహెచ్‌బీ వైపు వచ్చాడు. జేఎన్‌టీయూ సిగ్నల్ దాటాక బస్టాప్ వద్ద ద్విచక్ర వాహనంపై నుంచి పడిపోయాడు. తలకు తీవ్రగాయాలవగా, కాచిగూడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి కోమాలోనే ఉన్న అనంత్‌రెడ్డి ప్రాణాలు కోల్పోయాడు.

విద్యుదాఘాతంతో బీటెక్ విద్యార్థి మృతి



అనిల్‌కుమార్

చేగుంట, న్యూస్‌టుడే: చదువుకుంటూనే.. తల్లిదండ్రులకు చేదోడుగా ఉంటున్న ఓ యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మెదక్ జిల్లా చేగుంట ఎస్ఐ చైతన్యరెడ్డి తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా రాయపోల్‌కు చెందిన గడ్డమీది మంజుల, కిషన్ దంపతులు చేగుంటలోని గజ్వేల్ మార్గంలో ఉంటూ పాత ఇనుప సామగ్రి వ్యాపారం చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు అనిల్‌కుమార్(21), వినయ్ ఉన్నారు. అనిల్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర పరిధి హోలీ మేరీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం, చిన్న కుమారుడు ఇంటర్ చదువుతున్నారు. సెలవులకు అనిల్ ఇంటికొచ్చాడు. గురువారం మిత్రుడు సమీర్‌తో కలిసి పాత ఇనుప సామగ్రిని చిన్న లారీలో ఎక్కిస్తున్నాడు. ఇనుప నిచ్చెన పైకి ఎత్తుతుండగా 11 కేవీ విద్యుత్తు తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురై అనిల్ మృతిచెందాడు. కళ్లముందు విగతజీవిగా పడిఉన్న కుమారుణ్ని చూసి తల్లిదండ్రులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. గాయపడిన సమీర్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

తల్లి ఒడి చేరిన పసికందు

పోలీసుల అదుపులో ఇద్దరు మహిళలు

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: మాతృత్వం.. మహిళలకే ప్రత్యేకమైన ఓ వరం. ఓ మహిళ ఆడ శిశువుకు జన్మనిచ్చి దాన్ని పంచితే.. భూమ్మీద పడగానే అభంశుభం తెలియని ఆ బిడ్డను తల్లి పొత్తిళ్లకు దూరం చేసి అమ్మదనానికి మాయని మచ్చ తెచ్చారు మరో నలుగురు మహిళలు. అధునాతన సాంకేతికతకు పోలీసుల చొరవ తోడు కావడంతో 24 గంటల్లోనే ఆ శిశువు తల్లి ఒడి చేరింది. వివరాలు ఇలా..



శిశువుతో తల్లి

సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో అపహరణకు గురయిన పసికందు ఆచూకీ లభించింది. నలుగురు మహిళలు బుధవారం శిశువును అపహరించినట్లు సీసీ కెమెరాల్లో నమోదయిన విషయం విదితమే. సంగారెడ్డి పట్టణ సీఐ భాస్కర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసును 24 గంటల్లోనే ఛేదించారు. గురువారం హైదరాబాద్‌లోని బోరబండ పరిధి అల్లాపూర్‌లో నిందితులైన ఇద్దరు మహిళలను సంగారెడ్డి పోలీసులు పట్టుకున్నారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను శుక్రవారం వెల్లడిస్తామని సీఐ స్పష్టం చేశారు.

10 బృందాలతో గాలింపు

మనూరు మండలం దూదిగొండకు చెందిన నసీమా ఈ నెల 9న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సిజేరియన్ ద్వారా ఆడ శిశువుకు జన్మనిచ్చారు. నసీమా తల్లీ మునీబీ, అత్త హమీదాలు ఆసుపత్రి ఆవరణలోని కారిడార్‌లో ఆ శిశువును పడుకోబెట్టగా నలుగురు మహిళలు వచ్చి గుట్టుగా అపహరించారు. అక్కడి నుంచి స్కూటీపై ఉడాయించారు. సీసీ కెమెరాల్లో నమోదయిన దృశ్యాల ఆధారంగా వెంటనే చెక్ పోస్టుల వద్ద పోలీసులు తనిఖీలు పెంచారు. ఎస్పీ రూపేష్ ఆదేశాలతో పది ప్రత్యేక బృందాలను నియమించారు. విశ్వసనీయంగా అందిన సమాచారం ఆధారంగా హైదరాబాద్ బోరబండలోని అల్లాపూర్‌లో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. శిశువును తల్లి ఒడికి చేర్చారు. దీంతో తల్లితో పాటు కుటుంబీకులు ఆనందం వ్యక్తం చేశారు. శిశువులను అపహరించేందుకు నిందితులు పలుమార్లు రెక్కీ నిర్వహించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో పసికందు అపహరణ నేపథ్యంలో గురువారం అదనపు ఎస్పీ సంజీవరావు తనిఖీలు చేపట్టారు. మరోమారు ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అతిమెల మాణిక్ డిమాండ్ చేశారు. గురువారం ఆసుపత్రి పర్యవేక్షకులకు వినతి పత్రం అందజేశారు.

అన్నదాతకు తీపి కబురు

పంట నష్ట పరిహారం మంజూరు

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్

ఆరుగాలం శ్రమించే రైతులకు ప్రభుత్వం తీపి కబురును వినిపించింది. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో గత నెలలో భారీ వర్షాలు కురిసిన విషయం విదితమే. దీంతో చేతికొచ్చిన పంటలు నీళ్లపాలయ్యాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్, కోహెడ ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. ఆయా మండలాల్లోని పలు గ్రామాల్లో ఇసుక మేటేసి తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేసింది.

ప్రధాన పంటలు..

నాలుగు జిల్లాల్లో ప్రధానంగా వరి, పత్తి, కందులు, సోయాబీన్, పెసర, మినుము, చెరకు పంటలకు తీవ్ర నష్టం చేకూరింది. ఇక కూరగాయలు సాగు చేసిన వారి పరిస్థితి చెప్పనక్కర్లేదు. ఎంతో మంది తాము పెట్టిన పెట్టుబడైనా చేతికొచ్చేనా అని కలవరానికి గురయ్యారు. నష్టం తీరుపై సర్వే చేపట్టి, ఏ మేర దెబ్బతిన్నాయో అంచనా వేసి నివేదిక పంపించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ జిల్లాల్లో వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నష్టాన్ని లెక్క తేల్చారు.

33 శాతం మేర..

ప్రభుత్వ ఆదేశాలతో 33 శాతం లెక్కన నష్టాన్ని గుర్తించారు. గ్రామాలు, మండలాల వారీగా క్రోడీకరించిన వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం మంజూరు చేయడంతో పాటు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు ఇవ్వడం గమనార్హం. దసర పండగ సమయంలో పరిహారంపై ప్రభుత్వ ప్రకటనతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నష్టపోయిన పంట

నాలుగు జిల్లాల్లో నష్టపోయిన ఎకరాలు, రైతులు, పరిహారం మంజూరు వివరాలు..

	నష్టం	రైతులు	పరహారం (రూ.లలో)
సంగారెడ్డి	3288.34	2881	3,28,88,500
సిద్దిపేట	727.34	877	72,76,000
మెదక్	157.12	147	11,30,500
వికారాబాద్	1512.32	1378	1,51,28,000

ఆరోగ్యానికి గుడ్డు

నేడు ప్రపంచ గుడ్డు దినోత్సవం

న్యూస్‌టుడే, సిద్దిపేట



కోడిగుడ్డు.. ఎన్నో పోషకాల సమాహారం. ఎంతో మంది నిత్యం తీసుకునే ఆహారంలో ఓ భాగం. ఉడకబెట్టిన గుడ్డులో పోషకాలు పుష్కలమని వైద్య నిపుణులు చెబుతున్నారు. చౌకగా.. సులువుగా లభించే ఆహారం కావడం మరో విశేషం. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో గుడ్డు ప్రియులు భారీగానే ఉన్నారు. ఈ రంగంపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. నేడు ప్రపంచ గుడ్డు దినోత్సవం సందర్భంగా కలిగే ప్రయోజనాలపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

ఉడికించిన కోడిగుడ్డు తింటే లభించే పోషకాలు

- విటమిన్ ఎ - 6 శాతం
- విటమిన్ బి2- 15 శాతం
- విటమిన్ బి5 - 7 శాతం
- విటమిన్ బి12 - 9 శాతం
- సెలీనియం - 22 శాతం
- ఫోలేట్ - 5 శాతం
- ఫాస్పరస్ - 9 శాతం

మీకు తెలుసా..

60 గ్రాముల కోడి గుడ్డు నుంచి శక్తి - 103 కేలరీలు, ఇనుము - 1.26 మి.గ్రా, ఫాస్పరస్ - 132 మి.గ్రా, క్యాల్షియం - 36 గ్రాములు, కొవ్వులు - 7.9 గ్రాములు, ప్రొటీన్ - 7.9 గ్రాములు లభిస్తాయి. వాటితో పాటు క్యాల్షియం, జింక్, తదితర ఖనిజాలు, బీ6, డీ, ఈ, కే విటమిన్లు దండిగా ఉంటాయి. ఒక గుడ్డులో 1.5 గ్రాముల పచ్చసొన, 213 మి.గ్రా కొలెస్ట్రాల్, 75 క్యాలరీలు ఉంటాయి.

జిల్లా	గుడ్ల వినియోగం (సుమారు)
సిద్దిపేట	7 లక్షలు
సంగారెడ్డి	7.5 లక్షలు
మెదక్	2.5 లక్షలు
వికారాబాద్	1.5 లక్షలు

ప్రయోజనాలు అనేకం..

- పిల్లలకు ఆహారంలో కోడిగుడ్డును తప్పనిసరి చేయాలి. కంటి సంబంధిత సమస్యలు దరిచేరవు.
- నిత్యం గుడ్డు తీసుకుంటే శరీరానికి అవసరమైన కొలెస్ట్రాల్ లభిస్తుంది.
- రక్తపోటు అదుపులో ఉంటుంది.
- అల్పాహారంలో గుడ్డు తీసుకుంటే బరువు తగ్గుతారు. ఎత్తు పెరిగేందుకు దోహదపడుతుంది.

కావాల్సిన పౌష్టికాహారం..: డా. చందర్, అసోసియేట్ ప్రొఫెసర్, సిద్దిపేట సర్వజన ఆసుపత్రి



కోడిగుడ్డులో పోషకాహారం మెండు. గర్భిణులు, చిన్నారులు ఇష్టంగా తినడం అలవర్చుకోవాలి. ఆరోగ్యంగా ఉండేందుకు కావాల్సిన ప్రొటీన్లు ఉపకరిస్తాయి. శరీరం, గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

రతన్‌టాటాకు చిత్ర నివాళి



దిగ్గజ పారిశ్రామికవేత్త, టాటాసన్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటాకు సిద్దిపేటకు చెందిన చిత్రకారుడు కిన్నెర అంజయ్య చిత్ర నివాళి అర్పించారు. ఆయన మృతి సమాజానికి తీరని లోటని.. సామాన్యుల కలలను సాకారం చేసిన ఘనత టాటా సొంతమని పేర్కొన్నారు. మెదక్‌కు చెందిన ఓ విద్యార్థి పెన్సిల్ స్కెచ్‌తో చిత్రాన్ని ఆవిష్కరించారు. - న్యూస్‌టుడే, సిద్దిపేట, మెదక్‌అర్బన్

మూతపడిన పరిశ్రమలో భారీ చోరీ యత్నం

మనోహరాబాద్: మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులోని టీజీఐఐసీ పరిధిలోని మూతపడిన పరిశ్రమలో దుండగులు భారీ చోరీకి యత్నించారు. విషయం తెలిసి పోలీసులు దుండగులను వెంబడించడంతో పారిపోయారు. మనోహరాబాద్ ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. బ్యాంక్ రుణాలు చెల్లించకపోవడంతో కొన్ని సంవత్సరాల క్రితం బీఎస్ స్టీల్ పరిశ్రమను సీజ్ చేశారు. దీని గురించి ఎవరూ పట్టించుకోకపోవంతో కొన్ని రోజులుగా పరిశ్రమలోని ఇనుప సామగ్రిని మండలంలోని కోనాయిపల్లి, రంగాయపల్లి, ముప్పిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన నిందితులు చోరీ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి కొంతమందిని జైలుకు పంపారు. ఇదిలా ఉంటే బుధవారం అర్ధరాత్రి కొంతమంది పరిశ్రమ లోపలికి క్రేన్, టిప్పర్ తీసుకెళ్లి రూ.లక్షల విలువ చేసే భారీ యంత్రాన్ని చోరీ చేసేందుకు పన్నాగం పన్నారు. విశ్వసనీయ వర్గాల ద్వారా పోలీసులకు చోరీ సమాచారం అందడంతో వారు ఘటనా స్థలానికి వచ్చే సరికి అక్కడ క్రేన్ మాత్రమే ఉంది. వెంటనే అప్రమత్తమై వెంబండించగా మేడ్చల్ సమీపంలో టిప్పర్ దొరికింది. అందులో భారీ యంత్రం కనిపించడంతో పోలీసులను చూసి దుండగులు వాహనాన్ని వదిలేసి పారిపోయారు. ఎస్బీఐ అధికారి రవీందర్ ఫిర్యాదుతో కేసు నమోదైంది. క్రేన్, టిప్పర్‌ను సీజ్ చేసి దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. చోరీకి పాల్పడిన వారితో పాటు స్క్రాప్ దుకాణ యజమానిని పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. నిందితులను త్వరలో అదుపులోకి తీసుకుని వివరాలు వెల్లడించనున్నట్లు సమాచారం.

సంయుక్త సర్వే వాయిదా

బషీరాబాద్, న్యూస్‌టుడే: కర్ణాటక, తెలంగాణ అధికారులు అటవీ ప్రాంతంలో నిర్వహించే సంయుక్త సర్వే వాయిదా పడింది. ఇక్కడి విలువైన భూములపై కొన్నేళ్లుగా వివాదం నెలకుంది. అధికారులు అంతా సిద్ధం చేసినప్పటికీ.. చివరి క్షణంలో వాయిదా వేస్తున్నట్లు ఉన్నతాధికారులు మండల అధికారులకు సందేశం పంపించారు.

ఆరోగ్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

పూడూరు: పేదల కోసం నిర్వహిస్తున్న ఉచిత ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సాయి ఓరల్ హెల్త్ ఫౌండేషన్ నిర్వహకులు డాక్టర్ ఏఎస్. నారాయణ అన్నారు, పూడూరు సాయి మందిరంలో గురువారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. వివిధ సమస్యలకు సంబంధించి పరీక్షలు జరిపి మందులు ఇచ్చారు. కంటికి శస్త్రచికిత్సలు అవసరమున్న వారిని రిఫర్ చేశారు. కార్యక్రమంలో నిర్వహకులు నరేందర్, సౌమ్య, గోపాల్, అన్వర్ ఉన్నారు.

దళిత బహుజన శ్రామిక కార్యవర్గం ఎంపిక

దుద్యాల, న్యూస్‌టుడే: మండల దళిత బహుజన శ్రామిక నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు గురువారం తెలిపారు. అధ్యక్షుడిగా కె. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా నర్సమ్మ ఎన్నికయ్యాయరు.

రాయితీ విత్తనాలు లేనట్టే!

యాసంగిలో అన్నదాత అవస్థలు

న్యూస్‌టుడే, పరిగి:


దుక్కి సిద్ధం చేస్తున్న రైతన్న..

యాసంగి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆరుతడి పంటలను సాగు చేసుకునేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. రాయితీ విత్తనాల కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. నిత్యం వ్యవసాయ కార్యాలయం, ఆగ్రోస్ కేంద్రాల చుట్టూరా తిరుగుతున్నారు. సాగుకు అదను దాటుతోందని మరోవైపు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేరు సెనగ పల్లీలు క్వింటాలుకు విపణిలో రూ.13వేలు విక్రయిస్తున్నారు. విత్తన కాయలు క్వింటాలుకు రూ.7వేలు అమ్ముతున్నారు. వీటిని కొనుగోలు చేయడం సన్న, చిన్నకారు రైతులకు తలకుమించిన భారంగా మారుతోంది. ప్రతిసారి మాదిరిగానే ఈసారి కూడా రాయితీపై విత్తనాలను సరఫరా చేయాలని డివిజన్ రైతులు కోరుతున్నారు.

అందని పరికరాలు

పెట్టుబడులను నియంత్రించి అధిక దిగుబడుల సాధనకు యంత్ర పరికరాలు ఎంతో ఉపయోగం. సాగు విధానంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను అన్నదాతలు అందిపుచ్చుకోవాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. సాగును ప్రోత్సహించే క్రమంలోనే గత ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలు చేసింది. ప్రస్తుతం ప్రభుత్వం రైతు భరోసాకు కసరత్తులు చేస్తోంది. దీనికి యంత్రలక్ష్మి తోడైతే అన్నదాతల కష్టాలు చాలా వరకు తీరుతాయి. ఏ పంటను పండించాలన్న కనీసం ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. యంత్ర పరికరాలు అందుబాటులో ఉంటే కనీసం 25% కూలీల ఖర్చు తగ్గించుకునే అవకాశం ఉంటుంది. యాంత్రికీకరణ పథకానికి గత కొన్నేళ్లుగా నిధులు విడుదల కాక రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రధాన అవరోధంగా మారింది. నియోజకవర్గం అచ్చంగా వ్యవసాయమే కావడం పనులన్నీ ఒకేసారి రావడంతో కూలీల సమస్య తీవ్రంగా ఉంటోంది. వచ్చే నెలలో జరిగే పత్తితీత సమయాల్లో అయితే కర్నూలు, మంత్రాలయం, ఎమ్మిగనూరు తదితర ప్రాంతాల నుంచి కూలీలు వస్తే గానీ పనులు జరగవు.

68 వేల మంది రైతులు

వ్యవసాయ శాఖ పరిగి డివిజన్ పరిధిలో సుమారు 68వేల మంది రైతులు ఉన్నారు. వానాకాలంలో పత్తి, వరి, మొక్కజొన్న, కంది ప్రధాన పంటలు కాగా వేసవిలో వేరుసెనగ, శనగ, మొక్కజొన్న పంటలను అధికంగా సాగు చేస్తారు. సాగు సమయంలో కూలీల కొరత అధికంగా ఉంటోంది. రాయితీపై గతంలో మాదిరిగా పురుగు మందు పిచికారీ డబ్బాలు, కరెంటు మోటార్లు, రోటోవేటర్లు, గొర్రు, నాగళ్లు, కలుపు నివారణ, నూర్పిడి యంత్ర పరికరాలు, తదితర వాటిని అందజేస్తే తమకు కొంతైనా భారం తగ్గుతుందని భావిస్తున్నారు. రాయితీ లేకపోవడంతో వీటి వినియోగానికి దూరంగా ఉండాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం టార్పాలిన్లు కూడా సరఫరా లేకపోవడంతో పంట రక్షణకు నిత్యం పడరాని పాట్లు పడుతున్నారు.

మోయలేని భారం



మార్కెట్లో విత్తనాలు లేదా యంత్ర పరికరాలు కొనుగోలు పేదలకు మోయలేని భారం. మాకున్నది 1.5 ఎకరాల పొలం. యాసంగిలో ఆరుతడిగా వేరుసెనగ సాగు చేయాలని మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు వెళ్లి రూ.30వేల విత్తనాలను కొనుగోలు చేయాల్సి వచ్చింది. రాయితీపై సరఫరా చేస్తే డబ్బులు ఆదాతో ఎరువులకు వినియోగించేది.

– రాజు, రైతు, బ్రాహ్మణ్‌పల్లి, చెర్లతండా

ఆదేశాలు అందలేదు



రాయితీ విత్తనాలు, యంత్ర పరికరాలకు సంబంధించి ఇంకా ఆదేశాలు రాలేదు. పరికరాలు అవసరమని రైతులు అడుగుతున్నారు. రబీకి యంత్రలక్ష్మి పథకం కింద నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. రైతువేదికల ద్వారా సాగులో మెళకువలను రైతులకు వివరిస్తున్నాం.

– లక్ష్మీకుమారి, సహాయ సంచాలకులు, పరిగి డివిజన్

మేమున్నాం.. మీకు తోడుగా

వికారాబాద్‌టౌన్: 80742 74587
తాండూరు టౌన్: 80085 73260
పరిగి : 80085 73272
కొడంగల్: 94403 34770
(10 AM TO 1 PM)

న్యూస్‌టుడే, దౌల్తాబాద్: ? దౌల్తాబాద్ నుంచి లింగయ్య బావి మీదుగా కొడీడ్ వెళ్లే దారిలో గుంతలు ఇబ్బందికరంగా ఉన్నాయి. రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నాం. – రాము, దౌల్తాబాద్

✓ ఈరోడ్డును తారురోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. –రవికిరణ్, పీఆర్ ఏఈ, దౌల్తాబాద్.

న్యూస్‌టుడే, కుల్కచర్ల గ్రామీణ: ? రాంరెడ్డిపల్లి చౌరస్తాలో కొన్ని రోజులుగా ఆకాశ దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి సమయంలో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతుంది. – బాలు, స్థానికుడు

✓ రాంరెడ్డిపల్లి చౌరస్తాలో ఆకాశ దీపాలు పాడైపోయిందనేది వాస్తవమే. ఈ సమస్యను మండల అధికారులకు తెలిపాం. వీలైనంత త్వరగా ఆకాశదీపాల మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించేలా చూస్తాం. – కరుణాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి.

న్యూస్‌టుడే, తాండూరు టౌన్: ? సాయిపూరు కాలనీలోని వీధుల్లో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు దీపాలు వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలి. – రవి, తాండూరు.

✓ సమస్య పరిష్కరించటానికి కృషి చేస్తాం.– విక్రమసింహారెడ్డి, పురపాలక సంఘం కమిషనరు తాండూరు.

అక్రమ లే అవుట్లను క్రమబద్ధీకరించండి

వికారాబాద్ మున్సిపాలిటీ: అక్రమ లే అవుట్లను పారదర్శకంగా క్రమబద్ధీకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. గురువారం పురపాలక పట్టణాభివృద్ధి ప్రధాన కార్యదర్శి దానకిశోర్ స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్లలతో దృశ్య మాధ్యమం ద్వారా మాట్లాడారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నాలుగు పురపాలికల్లో వచ్చిన దరఖాస్తులను ఆయా శాఖల సమన్వయంతో పరిశీలించాలని అన్నారు.

అసంపూర్తి నిర్మాణంతో అవస్థలు



కుల్కచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే: బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని పాంబండ రామలింగేశ్వర స్వామి దేవాలయం దగ్గర చేపడుతున్న కాలక్షేప మండప నిర్మాణం పనులు అసంపూర్తిగానే కనిపిస్తున్నాయి. నిధులున్నా.. నిర్మాణం పనులు చేపట్టడంలో గుత్తేదారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అధికారులు చెబుతున్నారు. దీంతో దేవాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నిర్మాణం పూర్తి చేస్తే ఆలయానికి వచ్చే వాచ్చేవారు విశ్రాంతి తీసుకోడానికి అవకాశం ఉంటుంది. అధికారులు దృష్టి సారించి కాలక్షేప మండపం పనులు త్వరగా పూర్తి చేయించేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.

అధ్వానం.. యాలాల రోడ్డు



యాలాల, న్యూస్‌టుడే: లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా నుంచి యాలాల మండల కేంద్రం వరకు ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. గత 18నెలల క్రితం రోడ్డు మరమ్మతులలో భాగంగా గుత్తేదారు గుంతలు పడిన చోట మట్టిని తీయించి కంకర పరిచి వదిలేశాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రోడ్డు అలానే ఉంది. నిత్యం యాలాల మండలానికి ఉన్నతాధికారులతో పాటు మండల ప్రజలు వివిధ పనుల నిమిత్తం యాలాలకు రాకపోకలు సాగిస్తుంటారు. భారీ వర్షాలకు రోడ్డు గుంతలమయంగా మారి ప్రయాణికులకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది.

చినుకు పడిందా.. రోడ్లు జలమయం


నీటితో నిండిన సాయిపూరు-యాదిరెడ్డి చౌక్ రహదారి

న్యూస్‌టుడే, తాండూరు: పట్టణంలో చిన్న పాటి వానకురిస్తే చాలు అంతర్గత రహదారులు జలమయమౌతున్నాయి. ఈ పరిణామం వాహనాలపై రాకపోకలు సాగించే వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కాలినడకన వెళ్లే వారు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. గురువారం సాయంత్రం తాండూరులో కురిసిన వర్షానికి అంతర్గత రోడ్లు పూర్తిగా జలమయమయ్యాయి. ఎగువ నుంచి వచ్చిన వరద దిగువకు వేగంగా వెళ్లే పరిస్థితి లేక ఈ స్థితి దాపురించింది. పట్టణంలోని సాయిపూరు-యాదిరెడ్డి చౌక్, భవానీ నగర్, శాంతినగర్, మార్కండేయనగర్, మిత్రనగర్ కాలనీల్లోని రోడ్లు జలమయమయ్యాయి. రోడ్లకు ఇరువైపుల నుంచి వరద ప్రవాహం వేగంగా దిగువకు వెళ్లేలా పెద్ద కాలువలను నిర్మాణం చేయాలని స్థానికులు కోరుతున్నారు.


శాంతినగర్‌కు వెళ్లే అంతర్గత రోడ్డు ఇలా..

యాలాల: ఎన్కేపల్లి, అగ్గనూర్, లక్ష్మీనారాయణపూర్, గోరెపల్లి తదితర గ్రామాలలో గురువారం మధ్యాహ్నం గంట పాటు భారీ వర్షం కురిసింది. దీంతో మండలానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరో వైపు పత్తి, వరి పంటలు చేతికి రావడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

జాతీయ రహదారిపై వెలుగులు

ఈనాడు కథనానికి స్పందన

కొడంగల్, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై మూడు నెలలు ఆకాశదీపాలు వెలగడం లేదని నాలుగు రోజుల క్రితం 'ఈనాడు'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం ఉదయం ఆకాశ దీపాలకు కొత్తగా బల్బులు అమర్చారు. దీంతో అవన్నీ వెలుగుతున్నాయి.

పట్టపగలు ఆపడం లేదు..

పూడూరు, న్యూస్‌టుడే: కంకల్‌లోని వివిధ కాలనిలో స్తంభాలకు ఏర్పాటు చేసిన వీధి దీపాలు పగటి పూట వెలుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు సరఫరా అన్న సమయంలో రాత్రి, పగలు తేడా లేకుండా నిర్విరామంగా వెలుగుతుండటంతో తొందరలోనే పాడవుతున్నాయని కొత్తవి సకాలంలో అమర్చక అంధకారం నెలకొంటుందన్నారు. స్తంభాలకు ఆన్‌ఆఫ్ మీటలు ఏర్పాటు చేయిస్తే ఉపయోగించుకుంటామని చెబుతున్నారు.

పెద్దేముల్‌లో ఆర్ఎస్ఎస్ పదసంచాలన్


పెద్దేముల్‌లో కవాతు చేస్తూ..

పెద్దేముల్, న్యూస్‌టుడే: విజయదశమి సందర్భంగా పెద్దేముల్‌లో ఆర్ఎస్ఎస్ పదసంచాలన్ నిర్వహించారు. బంటారం, పెద్దేముల్ మండలాలకు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామంలోని ప్రధాన రహదారుల మీదుగా ప్రదర్శన చేపట్టారు. ఉన్నత పాఠశాల మైదానంలో శాఖ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ సిద్ధిరామేశ్వర్, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉప్పరి రమేష్ కుమార్, నాయకులు అశోక్, అనంత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గంధం ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

తాండూరుగ్రామీణ: ఈనెల 14, 15 తేదీల్లో నిర్వహించే మైబుస్వాన్ల దర్గా గంధం ఉత్సవాల్లో పాల్గొనాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని గ్రామానికి చెందిన ముఖ్య నాయకులు సుదర్శన్‌రెడ్డి, రవిశంకర్‌పటేల్, సరోత్తమరావు, న్యాయవాది మహేందర్ రెడ్డి బృందం కోరింది. ప్రజాభవన్‌లో ఎమ్మెల్యేను గురువారం వారు కలిశారు.


తాండూరు: దుర్గామాత సన్నిధిలో రోహిత్‌రెడ్డి


కొడంగల్ కుంకుమార్చనలో మహిళలు


కుల్కచర్లలో శ్రీరామానంద ఆశ్రమంలో చండీహోమం


వికారాబాద్ టౌన్: అలంకరణలో అమ్మవారు

దుర్గాదేవిగా అమ్మవారు

జిల్లా వ్యాప్తంగా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పల్లె, పట్టణ వాసులు భక్తి ప్రపత్తులతో నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలలో భాగంగా గురువారం అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆమె కృపకు పాత్రులయ్యారు. – న్యూస్‌టుడే, బృందం


కుల్కచర్లలో అమ్మవారికి ముక్కుపుడక అందజేస్తూ..


పాంబండలో..


తుంకిమెట్లలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


వికారాబాద్ గణేష్ కట్ట వద్ద మహిళలు

సద్దుల బతుకమ్మ సందడి

జిల్లాలో సద్దుల బతుకమ్మ సందడి అంతా ఇంతా కాదు. ప్రతి వీధిలోనూ మహిళలు, యువతులు తీరొక్క పూలతో వాటిని పేర్చారు. సాయంత్రం కొత్త దుస్తులు ధరించి బతుకమ్మను తీసుకుని వెళ్లి ఆడీపాడారు. వికారాబాద్‌లో ఆర్టీసీ డీఎం పాల్గొన్నగా యాలాలలో రాజకీయ పార్టీల నాయకులు సైతం ఏర్పాట్లు చేయించారు. – న్యూస్‌టుడే, బృందం


బతుకమ్మతో వెళుతూ..


పెద్దేముల్ బీసీ కాలనీలో మహిళలు


యాలాల మండల కేంద్రంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు

చోరులకు రాచబాట!

బీజాపూర్ రహదారి నుంచి పరారవుతున్న దొంగలు

బీజాపూర్ -హైదరాబాద్ జాతీయ రహదారి కావడంతో దొంగలకు రాచమార్గంగా మారింది. కొత్త వ్యక్తుల సంచారం కూడా ఉంటోంది. ఎవరికీ అనుమానం రాకుండా తిరుగుతూ తాళం వేసి ఇళ్లను నిశితంగా పరిశీలించి చోరీలకు పాల్పడుతున్నారు. ఇళ్లముందున్న వాహనాలు సైతం తాళాలు విరగ్గొట్టి మాయం చేస్తున్నారు. రద్దీగా ఉండే ఆర్టీసీ ప్రయాణికుల ప్రాంగణం, మార్కెట్ యార్డు, కూరగాయల మార్కెట్లలోనూ దొంగతనాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారిపై నుంచి తప్పించుకుంటున్నారు.

– న్యూస్‌టుడే, పరిగి, కుల్కచర్ల

జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న కుల్కచర్ల మండల కేంద్రంలోని కూడలి ప్రధానమైంది. ఈ మార్గం నుంచే మహబూబ్‌నగర్, పరిగి, కోస్గి, నవాబ్‌పేట తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగుతుంటాయి. రద్దీ విపరీతంగా ఉంటుంది. కొత్తవారినీ గుర్తించే వీలు పడదు. దీనికి తోడు చిన్నగేటు వద్ద, ఆర్టీసీ బస్టాండ్, పుట్టపహడ్, కుస్మసముద్రం, చౌడాపూర్, తిర్మలాపూర్ తదితర చోట్లా కూడ ఎక్కడా సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. ఏడాదిన్నరగా ఆయా గ్రామాల్లో వ్యాపారులు, ప్రజాప్రతినిధుల నుంచి విరాళాలను సేకరించి ఏర్పాటు చేసిన కెమెరాలను నిర్వహణ లేకుండా పోయింది. ఇదే దొంగలకు అనుకూలంగా మారింది.


పరిగి నుంచి జాతీయ రహదారికి వెళ్లే మార్గం

ఇవిగో ఉదాహరణలు

- కుల్కచర్ల మండల కేంద్రంలో పది రోజుల క్రితం గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు స్కూటీపై వచ్చి కిరాణా దుకాణంలో ఉన్న మహిళ మెడలో గొలుసు లాక్కుపోయేందుకు విఫలయత్నం చేశారు. మహిళ అప్రమత్తమవడంతో వచ్చిన వ్యక్తులు జాతీయ రహదారిపై నుంచి పరారయ్యారు.
- తాజాగా కుల్కచర్లలోనే ఓ కమీషన్ ఏజెంటు దుకాణానికి ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి వేరుసెనగ విత్తనాలు కావాలంటూ.. అడగడంతో వాటిని దుకాణంలో ఉన్న మహిళ విత్తనాలు చూపిస్తుండగానే మరో వ్యక్తి గల్లాపెట్టెలో ఉన్న రూ.20 వేలను ఎత్తుకెళ్లారు. ఈ రెండు సంఘటనలోనూ నిందితులు కుల్కచర్ల ప్రధాన చౌరస్తా మీదుగానే తిరిగి వెళ్లి పోయారని స్థానికులు తెలిపారు.
- పరిగి పట్టణంలో వారం రోజుల క్రితం దొంగలు ఓ ఇంట్లోకి చొరబడి నగదు, నగలు ఎత్తుకెళ్లారు.
- బాహర్‌పేట కూడలిలో పెయింట్ దుకాణంలోనూ చోరీ చేసి కొంత నగదును అపహరించుకు పోయారు.
- ఓ ఇంటి ముందు నిలిపి ఉన్న బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తి ఎత్తుకెళ్లాడు. ఇక్కడ మాత్రం కాలనీ వాసులు ఏర్పాటు చేసుకుని ఉన్న సీసీ కెమెరాలో సంఘటన నిక్షిప్తమై ఉంది.

ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం

పండగల సమయం కావడంతో ఊళ్లకు వెళ్లేవారు తమ ఇళ్లలో విలువైన వస్తువులేవీ ఉంచుకోవద్దు. సమీప వ్యక్తులను తరచుగా తమ ఇళ్లను చూడాలని చెప్పి వెళ్లడం శ్రేయస్కరం. దొంగతనాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. ఈక్రమంలోనే రద్దీ ప్రాంతాల్లో దృష్టి సారించాం. ప్రజలు, వ్యాపారులు వ్యక్తిగతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని బద్రత పట్ల అవగాహన కల్పిస్తూ అప్రమత్తం చేస్తున్నాం. జాతీయ రహదారిపైనా గస్తీ ముమ్మరం చేశాం.

– సంతోష్‌కుమార్, అన్వేష్‌రెడ్డి, ఎస్సైలు, పరిగి, కుల్కచర్ల

ఆబ్కారీ కానిస్టేబుల్‌పై దాడిచేసిన వ్యక్తులపై కేసు

తాండూరు టౌన్: ఆబ్కారీ కానిస్టేబుల్‌పై దాడిచేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపారు. తాండూరులోని ఆబ్కారీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కృష్ణ బుధవారం రాత్రి ఇంటికి వెళ్తున్న క్రమంలో సాయిపూరు మార్గ మధ్యలో ఓ కిరాణ దుకాణంలో కోడి గుడ్లు కొన్నాడు. అక్కడ కొందరు వ్యక్తులు బహిరంగంగా మద్యం తాగుతుండగా వారిని వారించి వెళ్లిపోయారు. సాయిపూరు ప్రాంతానికి చెందిన ఫజల్, జగదీష్ అతడిని వెంబడించి ఇంటికి వెళ్లి దాడి చేశారు. అతనికి గాయాలు కాగా వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఫజల్, జగదీష్‌తో పాటు మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

దసరా పండగకు ఏర్పాట్లు

పరిగి, న్యూస్‌టుడే: దసరా పండగను పురస్కరించుకుని పురపాలక సంఘం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం బాలాజీనగర్‌లోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయ పరిసరాలను బాగు చేసే పనులు చేపట్టారు.

మేకలు, గొర్రెల సంత ప్రారంభం


తాండూరు జీవాల సంత ప్రారంభోత్సవంలో నాయకులు

న్యూస్‌టుడే, తాండూరు: వ్యవసాయ విపణి పరిధిలోని పశువుల మార్కెట్ యార్డులో గురువారం మేకలు, గొర్రెల విక్రయాల సంతను పాలక మండలి ప్రారంభించింది. స్థానికంగా జీవాల విక్రయాల సంత లేక పోవడంతో చాలా మంది మోమిన్‌పేట, సదాశివపేట, కోస్గి తదితర ప్రాంతాలకు కొనుగోలుకు వెళుతున్నారు. ఈ నేపథ్యంలో చేరువలో ఉన్న తాండూరులో సంతను ఏర్పాటు చేసినట్లు విపణి ఛైర్మన్ బాల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ నర్సిరెడ్డి, విపణి కార్యదర్శి శ్రీనివాస్, యాలాల మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తమరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు సిద్రాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దిగ్గజ పారిశ్రామికవేత్తకు నివాళి


తాండూరులో నివాళులు అర్పిస్తూ...

దుద్యాల, న్యూస్‌టుడే: ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్‌టాటా కన్నుమూయడంతో వ్యాపార సంస్థల వారు సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం మండలంలోని హస్నాబాద్ గ్రామంలో ఓ ప్రైవేట్ కంపెనీ వారు రతన్‌టాటా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. వ్యాపారంతో పాటు ఎన్నో ప్రజా సేవా కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు. ప్రవీణ్, గోపి, నాగేష్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దేముల్, న్యూస్‌టుడే: మండలంలోని గాజీపూర్ గ్రామంలో రతన్ టాటాకు గ్రామస్థులు ఘన నివాళులు అర్పించారు. యువకులు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో వడ్ల సంతోష్, సంగమేష్, జనార్దన్, అనిల్, సందీప్, బాలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.